నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్
సోమవారం | 18 మార్చి 2024 | www.navatelangana.com

అకాల వర్షానికి కూలిన ఇల్లు



నవతెలంగాణ-రాయపోల్

రాయపోల్ మండలం సయ్యద్ నగర్ గ్రామంలో శనివారం అర్ధరాత్రి కురిసిన అకాల వర్షానికి నిరుపేద కుటుంబానికి చెందిన సయ్యద్ యాకుబ్ బీ రేకుల ఇల్లు పాక్షికంగా కూలిపోయింది. నిరుపేద కుటుంబానికి చెందిన యాకుబ్ బీ పొట్టకూటికోసం కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తుంటుంది. ఆమె భర్త సయ్యద్ అలీ పది సంవత్సరాల క్రితం సౌదీ అరేబియాకు వలస వెళ్లి మతి చెందడం జరిగింది. అప్పటి నుంచి వారి ముగ్గురు పిల్లలను సాదుకుంటూ కూలి పని చేసుకుంటూ బతుకుతున్నారు. గ్రామంలో నివాసం ఉండటానికి ఉన్న చిన్నపాటి రేకుల ఇల్లు కూడా అకాల వర్షానికి కూలిపోవడంతో తీవ్ర దిగ్భ్రాంతికి గురవుతున్నారు. ప్రభుత్వం వీరి కుటుంబాన్ని ఆదుకొన ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి ఆ కుటుంబానికి భరోసాగా నిలవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

టినీ లర్నర్స్ ప్లే స్కూల్లో అన్యువల్ డే



నవతెలంగాణ-సిద్దిపేట

పట్టణంలోని టినీ లర్నర్స్ ప్లే స్కూల్లో అన్యువల్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు ఆటపాటలతో, ముద్దు ముద్దు మాటలతో ఆకట్టుకున్నారు. ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ అయోధ్య రెడ్డి, 42 వ వార్డు బీఆర్ఎస్ నాయకులు కాటం రఘురాం మాట్లాడుతూ చిన్నారులు చేసిన ఆటపాటలు ఆకట్టుకున్నాయని అన్నారు. ఈ వయసులోనీ పిల్లలతో తల్లిదండ్రులు, టీచర్లు ప్రేమతోనే ఉండాలని సూచించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన పిల్లలకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూలు ప్రిన్సిపల్ నాయిని భవాని, టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల చిరకాల స్వప్నం నిజం చేసిన కాంగ్రెస్ సర్కార్



నవతెలంగాణ-జోగిపేట

రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్యవైశ్యుల చిరకాల స్వప్నం నెరవేర్చిందని జోగిపేట పట్టణ మాజీ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు, అందోల్ జోగిపేట మున్సిపల్ 13వ వార్డు కౌన్సిలర్ రంగ సురేష్ తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. ఎన్నో ఏండ్లుగా గత ప్రభుత్వాలు ఆర్యవైశ్యుల కార్పొరేషన్ విషయంలో కాలయాపన చేశాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్యవైశ్యులకు ప్రత్యేక గుర్తింపు ఇస్తూ ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ లకు ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. గత 10 ఏండ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం కార్పొరేషన్ విషయంలో మాట ఇచ్చి నిర్లక్ష్యం చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పెట్టిన విధంగా మాట ఇచ్చి నిలబెట్టుకుందన్నారు. రాష్ట్రంలోని ఆర్యవైశ్యులందరూ కాంగ్రెస్ పార్టీపై విశ్వాసంగా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఆర్యవైశ్యులలో కూడా ఎంతోమంది పేదలు ఉన్నారని, కార్పొరేషన్ ఏర్పాటుతో వారి జీవితాల్లో వెలుగులు వస్తాయన్నారు. లక్షలాదిమందికి ప్రయోజనం చేకూరుతుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఆర్యవైశ్యులంతా కాంగ్రెస్ పార్టీకి మద్దతు పలకాలని కోరారు.

ద్విచక్ర వాహనాలు ఢీ : ఒకరు మృతి, ఇద్దరికి గాయాలు



నవతెలంగాణ-మునిపల్లి

ద్విచక్ర వాహనాలు ఢీకొని అక్కడికక్కడే ఒకరు మృతి చెందగా ఇద్దరికి స్వల్ప గాయాలైన ఘటన మండలంలోని లింగంపల్లి గ్రామ శివారులో ఆదివారం సాయంత్రం జరిగింది. స్థానిక ఎస్ఐ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గుల్బర్గ జిల్లా, చొంచోలి తాలుకా, శ్రీనగర్ పెద్దతండాకు చెందిన పరుశురాం రాథోడ్, జ్యోతి దంపతులు బైక్‌పై జహీరాబాద్ వైపు నుంచి సంగారెడ్డి వైపునకు జాతీయ రహదారి ఎన్‌హెచ్-65 పై వెళ్తున్నారు. ఈ క్రమంలో మార్గమధ్యలో లింగంపల్లి గ్రామ శివారులోకి రాగానే వెనుక వైపు నుంచి రాయల్ ఎన్ఫీల్డ్ బైక్ పై మహమ్మద్ ఎజాజ్ అనే వ్యక్తి అతివేగంగా వచ్చి పరుశురాం బైక్‌ను ఢీకొట్టాడు. దాంతో జ్యోతి అక్కడికక్కడే మృతి చెందింది. పరశురాం తీవ్రంగా గాయపడ్డాడు. ఎజాజ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను జహీరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. మృతురాలి భర్త పరశురాం రాథోడ్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కౌన్సిలర్ తనయులకు నూతన వస్త్రాలంకరణ



నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని 3వ వార్డు కౌన్సిలర్ మార్కంటి వరలక్ష్మీ కనకయ్య ముదిరాజ్ తనయుల నూతన వస్త్రాలంకరణ చేశారు. ఆదివారం గజ్వేల్ లోని ఓ ప్రైవేట్ పంక్షన్ హాల్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎఫ్‌డీసి చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, ఎమ్మెల్సీ వంటేరు యద వరెడ్డి, మున్సిపల్ చైర్మన్ నేతి చిన్న రాజమౌళి, వైస్ చైర్మన్ జక్కియొద్దీన్, మున్సిపల్ కౌన్సిలర్లు, ముఖ్య అతిథిగా హాజయయ్యారు. చిన్నారులు మార్కంటి భారత్ తేజ, శ్రీశాంత్ లను ఆశీర్వదించారు. ఈ నూతన వస్త్ర అలంకరణ మహోత్సవానికి బంధు మిత్రులు అధిక సంఖ్యలో హాజరై చిన్నారులను ఆశీర్వదించారు. నూతన వస్త్రాలంకరణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బంధుమిత్రుడు స్నేహితులు తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు ఆల్ ది బెస్ట్..



నవతెలంగాణ-రాయపోల్

పదవ తరగతి వార్షిక పరీక్షలు సోమవారం మార్చి 18 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో పరీక్షలు వ్రాసే పదవ తరగతి విద్యార్థిని, విద్యార్థులకు ఎస్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షురాలు, సామాజిక ప్రజా సేవకురాలు మహమ్మద్ సుల్తాన ఉమర్ ఆల్ ది బెస్ట్ తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని.. ఏడాది మొత్తం కష్టపడి చదివిన సబ్జెక్టులు ఇష్టంతో పరీక్షలలో రాసి అందరు మంచి ఉత్తీర్ణత సాధించాలని కోరుకుంటున్నానన్నారు. అలాగే పదవ తరగతి మీ బంగారు భవిష్యత్తుకి ఇది పునాది లాంటిదని పరీక్షలు బాగా రాసి మీ తల్లిదండ్రులకు, గ్రామానికి మీరు చదివినపాఠశాలకు మంచిపేరు తెచ్చి వారి కలలను నిజం చేయాలని ఆకాంక్షించారు.

పిడుగుపాటుకు పాడి ఆవు మృత్యువాత



నవతెలంగాణ-బెజ్జంకి

పిడుగుపాటుకు పాడి ఆవు మృత్యు వాత పడిన ఘటన మండలంలోని గుండారం గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. రైతు మ్యాకల కుంటయ్య తన పాడి ఆవును వ్యవసాయ పొలం వద్ద కట్టేసి ఇంటికి తిరిగి వచ్చాడు. శనివారం రాత్రి సమయంలో పిడుగులతో కూడిన వర్షం కురిసింది. దాంతో పిడుగుపాటుకు పాడి ఆవు మృత్యువాత పడినట్టు రైతు అనుమానం వ్యక్తం చేశారు. సంబదిత అధికారులు మృత్యువాత పడిన పాడి ఆవుపై విచారణ చేపట్టి న్యాయం చేయాలని బాధిత రైతు విజ్ఞప్తి చేశారు.

కురుమలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ-సిద్దిపేట

కురుమలకు ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని సిద్దిపేట జిల్లా కురుమ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కొలుపుల రాములు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం ప్రెస్‌క్లబ్ లో సిద్దిపేట జిల్లా కురుమ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యాదవులతో కలిసి కాకుండా, మెజా రిటీ జనాభా ఉన్న కురుమలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయడం ద్వారా తమకు న్యాయం జరుగుతుందని తెలిపారు. కార్యక్ర మంలో జిల్లా కురుమ సంఘం కార్యదర్శి స్వామి, అధ్యక్షులు కోరే ఎల్లయ్య, నాయకులు జిందం రాజవ ఎల్లయ్య, కంతుల రమేష్, ఉద్యోగ సంఘం నాయకులు కంతుల లక్ష్మణ్, వెంకట్, కంతుల రాములు, కోరే రాములు, ఆలేటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత



నవతెలంగాణ-బెజ్జంకి

మండల పరిధిలోని గాగీల్లపూర్ ప్రభుత్వోన్నత పాఠశాలలో పది విద్యార్థులకు స్థానికుడు తూముల రమేశ్ యాదవ్ తన తండ్రి బాలయ్య యాదవ్ జ్ఞాపకార్థం అదివారం పరీక్షా సామగ్రిని అందజేశారు. పదిలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని రమేశ్ యాదవ్ అకాక్షించారు. స్థానిక యువకులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరంలో రక్త దానం



నవతెలంగాణ-తొగుట

ఉచిత వైద్య శిబిరంలో తొగుట సీఐ ఎస్కే లతీఫ్ ఆదివారం రక్త దానం చేశారు. వెంకట్రావు పేట గ్రామంలో విశ్వ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు ఉచిత వైద్య శిబిరంలో ఆయన పాల్గొని రక్తదానం చేసిన వారికి అభినందనలు తెలిపారు.

పెరిగిన బీటీ పత్తి విత్తనం ధర

- వచ్చే ఖరీఫ్‌లో రైతుపై భారం
- గతేడాదితో పోలిస్తే ప్యాకెట్‌పై రూ.11 అధికం
- 1.5 లక్షల ఎకరాల వరకు సాగయ్యే అవకాశం



నవతెలంగాణ-గజ్వేల్

బీటీ పత్తి విత్తన ధర స్వల్పంగా పెరిగింది. 475 గ్రామల పరిమాణం కలిగిన బీటీ-2 ప్యాకెట్ గతేడాది రూ.853 ఉండగా. ఈ సారి రూ.864కు పెంచారు. దీని ప్రకారం ఒక్కో ప్యాకెట్‌పై రూ.11 అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. పెరిగిన ధర ప్రకారం రైతులపై సుమారుగా రూ.45 లక్షలకుపైగా భారం పడనుంది. కంది, సోయా తదితర విత్తనాల ధరలను కొద్ది రోజుల్లోనే ప్రకటించనున్నారు. నాలుగేండ్లుగా విత్తన సబ్సిడీ ఎత్తివేయడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వమైనా సబ్సిడీ వరింపజేయాలని రైతులు కోరుతున్నారు. జిల్లాలో ఏటా వర్షాకాలంలో 5.50 లక్షల ఎకరాలకుపైగా వివిధ రకాల పంటలు సాగు చేస్తుండగా.. ఇందులో పత్తి 1.5 లక్షల ఎకరాల వరకు ఉంటుంది. దాంతో ఈ పంటే కీలకంగా మారుతోంది.

జిల్లాలో అత్యధికంగా రైతులు మొగ్గు చూపే బీటీ-2 విత్తన ప్యాకెట్లు (475 గ్రాముల ప్యాకెట్) సీజన్‌లో 4 లక్షల ప్యాకెట్లు వరకు అవసరముంటాయి. రైతులు ఒక్కో ఎకరాకు రెండున్నర ప్యాకెట్లను విత్తడానికి వాడుతుంటారు. ఈ ప్యాకెట్‌లో 450 గ్రాముల బీటీ, మరో 25 గ్రాముల నాన్ బీటీ విత్తనాలు ఉంటాయి. గతేడాది వరకు రూ.853 లభించింది. ఈసారి విత్తన కంపెనీలు ఒక్కో ప్యాకెట్‌పై రూ.11 పెంచగా ప్రస్తుత ధర రూ.864కు చేరింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలు వెలువడ్డాయి. జిల్లాలో సుమారు 30కి పైగా కంపెనీలు తమ ఉత్పత్తులను ఇదే ధరకు విక్రయించనున్నాయి. ఇకపోతే బీజీ-1 రకానికి చెందిన విత్తన ప్యాకెట్ల ధరల్లో మార్పులేదు. గత సంవత్సరం ఈ విత్తన ప్యాకెట్ ధర రూ.635 ఉండగా, ఈ సీజన్ లోనూ అదే ధరను కొనసాగిస్తున్నారు.

ఇతర విత్తన ధరలపైనా పై కూడా స్పష్టత రావాల్సి ఉన్నది. జిల్లాలో ఈసారి వరి సాగు భారీగా 3.50 లక్షల ఎకరాల్లో సాగులోకి వచ్చే అవకాశముందని వ్యవసాయశాఖ అంచనా వేస్తోంది. ఇందుకోసం జిల్లాకు వివిధ రకాల వరి విత్తనాలు 60 వేల క్వింటాళ్లకుపైగా అవసరముంటాయి. గత సంవత్సరం తెలంగాణ సోనా విత్తనాలు క్వింటాలుకు రూ.3400, ఎంటీయూ రకం రూ.3100కు పైగా ధర పెట్టి కొన్నారు. వచ్చే వర్షాకాలం ధర ఏ విధంగా ఉండబోతుందో ఎదురుచూడాల్సి ఉంది. కంది ఈసారి 60వేల ఎకరాల్లో సాగులోకి వస్తుందని అంచనా వేస్తుండగా.. 3,053 క్వింటాళ్లకు పైగా విత్తనాలు అవసరముంటాయి. సోయాబీన్ 120 ఎకరాల్లో సాగులోకి వస్తుందనే అంచనా ఉండగా.. 30 క్వింటాళ్ల విత్తనం అవసరముంది. గత సంవత్సరం ఈ విత్తనం కూడా క్వింటాలుకు రూ.9,800కు లభించింది. వీటి కొత్త ధరలు కొద్ది రోజుల్లోనే రానున్నాయి. దాదాపుగా పెరుగుదల ఉంటుందనే భావిస్తున్నారు. కొత్త ప్రభుత్వం సబ్సిడీని పునరుద్ధరిస్తే తమకు మేలు జరుగుతుందనే ఆశతో రైతులు ఎదురుచూస్తున్నారు. కాగా, సీజన్ మరో నెల రోజుల్లో ప్రారంభం కానున్న దృష్ట్యా నిల్వలు తెప్పించడానికి వ్యవసాయశాఖ కసరత్తు చేస్తోంది.

ఆత్మవిశ్వాసంతో పరీక్ష వ్రాయండి



నవతెలంగాణ-సిద్దిపేట

ఆత్మవిశ్వాసంతో పరీక్ష రాయాలని.. పదవతరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు మాజీ మంత్రి ఎమ్మెల్యే, హరీశ్‌రావు శుభాశీస్సులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిద్దిపేట నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించామని తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించి 100శాతం ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు.. తమ తల్లిదండ్రుల ఆశయాలను నెరవేరుస్తారని ఆశిస్తున్నానని తెలిపారు. వారంతా విజేతలుగా నిలవాలని ఆశీర్వాదిస్తూ తాను ఉత్తరాలు పంపించానని అన్నారు. గత పరీక్షలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులు బాసర ట్రిపుల్ ఐటీలో సీట్లు పొంది ఉన్నత విద్య చదువుతున్నారని తెలిపారు. గత రెండేండ్లలో ఉత్తీర్ణతలోనూ, ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించడంలో మన జిల్లా అగ్రస్థానంలో నిలిచిందని అన్నారు. ఈ స్థానాన్ని నిలబెట్టుకొని ముందు తరాలకు ఆదర్శంగా నిలవాలని కోరారు.

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- జిల్లాలో పరీక్షలు రాయనున్న 13,987 మంది విద్యార్థులు
- ఫిజికల్ సైన్స్, బయోలాజికల్ సైన్స్‌కు వేర్వేరుగా పరీక్షలు



నవతెలంగాణ-సిద్దిపేట

నేటి నుండి ఏప్రిల్ 2 వరకు జరగనున్న 10వ తరగతి వార్షిక పరీక్షలకు జిల్లాలో 80 సెంటర్లలో నిర్వహించడానికి విద్యాశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. పరీక్షలు ఉదయం 09.30 నుండి మధ్యాహ్నం 12.30 వరకు నిర్వహించనున్నారు. జిల్లా వ్యాప్తంగా 371 పాఠశాలల నుంచి 13,987 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. వారిలో 7036 మంది బాలురు, 6951 మంది బాలికలు ఉన్నారు. ఒకసారి ఫెయిల్ అయిన వారిలో బాలురు- 3, బాలికలు-3 కూడా పరీక్షలు రాయనున్నారు. ఏప్రిల్ 1, 2న జరిగే ఒకేషనల్ పరీక్షలకు 18 సెంటర్లలో బాలురు- 790, బాలికలు-871, మొత్తం-1661 పరీక్షలు రాయనున్నారు. ఒక్క నిమిషం నిబంధన తొలగించి ఐదు నిమిషాల వరకు అవకాశం కల్పించారు. విద్యార్థులు 9 గంటలలోపు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని అధికారులు సూచించారు. పరీక్షా కేంద్రంలో ఇచ్చే ఓఎంఆర్ షీటును ఒకసారి సరిచూసుకోవాలని విద్యార్థులకు సూచిస్తున్నారు. 80 పరీక్షా కేంద్రాల్లో 58 ప్రభుత్వ 22 ప్రయివేటు పాఠశాలలున్నాయి. ప్రభుత్వ ఉపాధ్యాయులనే ఇన్విజిలేటర్‌గా ఉపయోగించుకుంటున్నారు. విద్యార్థులకు సెంటర్లలో అన్ని రకాల సౌకర్యాలను ఏర్పాటు చేశారు. మంచినీరు, ఫ్యాన్, ఫర్నిచర్ ఉండే విధంగా చర్యలు తీసుకున్నారు. ఆర్టీసీ బస్సుల్లో హాల్ టికెట్లు చూపించి ఉచితంగా ప్రయాణం చేయవచ్చు. ఆన్‌లైన్ ద్వారా హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకొని పరీక్షలు రాయవచ్చని అధికారులు తెలిపారు. గతంలో ఫిజికల్ సైన్స్, బయోలాజికల్ సైన్స్ ఒకే రోజు పరీక్షలు జరిగేవని, ఈసారి వాటిని వేర్వేరుగా నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

ఏర్పాట్లు పూర్తి ..



ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయడానికి ఏర్పాట్లు పూర్తి చేశాం. విద్యార్థులు ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురావొద్దు. పరీక్షల నిర్వహణ కోసం 23 స్టోరేజ్ పాయింట్లు, ఏడుగురు కస్టోడియన్, ఏడుగురు రూట్ ఆఫీసర్లు, 80 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 80 మంది డిపార్ట్‌మెం టల్ అధికారులు, 46 మంది స్టోరేజ్ పాయింట్ సంరక్షకులు, 789 మంది ఇన్విజిలేటర్లను నియమించాం. పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుంది.

- శ్రీనివాసరెడ్డి, డీఈఓ

కాల్వ ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి

- కాల్వ పూడ్చితే రైతులకు నష్టం
- పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు
- సీపీఐ(ఎం) పార్టీ మండల కార్యదర్శి సత్తిరెడ్డి



నవతెలంగాణ-కొమురవెల్లి

డిటిపిసి లేఅవుట్ పేరుతో గుగ్గిళ్ళకుంట మత్తడి మత్తడి కాల్వను ఆక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) పార్టీ మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి అన్నారు. ఆదివారం పార్టీ నాయకులతో కలిసి మత్తడి కాల్వ భూమిని పరిశీలించారు ఈ సందర్భంగా సత్తిరెడ్డి మాట్లాడుతూ.. రసులాబాద్ దుర్గమ్మ గుడి క్రాసింగ్ దగ్గర గుగ్గిళ్ళ కుంట నుండి వచ్చే మత్తడి కాలువను రియల్ ఎస్టేట్ వ్యాపారి పూడ్చివేస్తున్నా ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. స్థానిక రైతులకు నష్టం జరుగుతున్న విషయాన్ని విస్మరించి లంచాలకు ఆశపడ్డ సంబంధిత శాఖ అధికారులు ప్లాట్లు చేస్తున్న వారికి లేఅవుట్ కు అనుమతి ఇవ్వడాన్ని తప్పుపట్టారు. వెంటనే సంబంధిత అధికారులు పరిశీలించి మత్తడి నీళ్ల వెళ్లే కాల్వను పునరుద్ధరించకపోతే సీపీఐ(ఎం)ఆధ్వర్యంలో ఆందోళన నిర్వ హిస్తామని ఇరిగేషన్ అధికారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మత్స్య కార్మిక సంఘం జిల్లా కన్వీ నర్ ఇస్తారి, సీపీఐ(ఎం) మండల నాయకులు వుల్లం పల్లి సాయిలు, సున్నం యాదగిరి, రవీ, గోరెమియ, సంఘం నాయకులు కనకయ్య, యాదయ్య, నవీన్ తదితరులు పాల్గొన్నారు

మెదక్ పార్లమెంట్ స్థానం కాంగ్రెస్ గెలవడం ఖాయం

- మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి
- ఉమామహేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-గజ్వేల్

మెదక్ పార్లమెంటు గడ్డపైన కాంగ్రెస్ జెండా ఎగరవేస్తామని సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి అన్నారు. ఆదివారం గజ్వేల్ పట్టణంలోని ఉమామహేశ్వర ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి మీడియాతో మాట్లాడారు. మెదక్ జిల్లా కాంగ్రెస్‌కు కంచుకోట అని, దాన్ని తిరిగి నిలుపుకుంటామన్నారు. మెదక్, జహీరాబాద్ రెండు స్థానాలనూ కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ రోజురోజుకు బలపడటమే కాకుండా పార్లమెంట్ ఎన్నికల్లో 15 స్థానాలను గెలిచేలా ప్రణాళికలు చేసినట్టు చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల నాటికి గజ్వేల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండాను ఎగరవేస్తామని స్పష్టంచేశారు. గజ్వేల్ నియోజకవర్గంలో రెండు మున్సిపాలిటీలు, 9 ఎంపీపీ, 9 జెడ్పీటీసీలను కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందని, కార్యకర్తలు, నాయకులు పార్టీలోకి తిరిగి వస్తున్నారన్నారు. పేదల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసిందని, 100 రోజుల్లో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతుందని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను దశలవారీగా నెరవేరుస్తూ ప్రజా రంజక పరిపాలన కొనసాగుస్తున్నామన్నారు. త్వరలో కాంగ్రెస్ పార్టీలోకి గజ్వేల్ నియోజకవర్గంలో ఇతర పార్టీల నుంచి చేరికలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి నాయిని యాదగిరి, గజ్వేల్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మొనగారి రాజు, ప్రధాన కార్యదర్శి నక్క రాములు, జే శేఖర్, జంగం రమేష్, గాజుల శ్రీనివాస్, రాజు, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

తొగుట పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

- పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం.



నవతెలంగాణ-తొగుట

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యా ర్థుల ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఆది వారం వెంకట్రావు పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాల 1993 నుండి 1998 కు చెందిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ మేము వెంకట్రావు పేటలో 6వ తరగతి నుండి 10 వ తరగతి విద్యను అభ్యసించామని అన్నారు. చదువు పూర్తయిన 26 సంవత్సరాల తరువాత ఈ విధంగా కలుసుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. మేము ఈ రోజు ఇంత గొప్ప స్థాయికి రావడానికి మా గురువులే కారణమని తల్లి, తండ్రి తరువాత ఎవరైనా గురువులను గౌరవించాలన్నా రు. త్రిమూర్తులు అంటే తల్లి, తండ్రి, గురువు అభిప్రాయం వ్యక్తం చేశారు. మేము గురుదక్షణ కింద వారికి ఏమిచ్చినా రుణం తీర్చుకోలేమని అన్నారు. జీవితాంతం తమ గురువులకు రుణపడి ఉంటామ ని వారిని ఎల్లవేళలా గుర్తించుకుంటామని తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులు నాగరాజు, రామ్‌రెడ్డి మాట్లాడుతూ చాలా సంవత్సరాల తర్వాత మళ్లీ విద్యార్థులందరినీ కలుసుకోవడం సంతోషకరమన్నారు. ఉపాధ్యాయులకు విద్యార్థులు తమ కంటే ఉన్నత స్థాయికి ఎదిగితే దానికి మించిన గురుదక్షిణ లేదన్నారు. విద్యార్థులదరూ గొప్ప స్థాయికి ఎదిగి సుఖసంతోషాలతో జీవించా లని కోరుకున్నారు. అనంతరం వారికి విద్యాబుద్ధులు చెప్పిన ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానం చేశారు.

కొండపాక మండలానికి సాగునీరు రాకుండా అడ్డగింత



నవతెలంగాణ-కొండపాక

కొండపాక మండలంలోని పలు గ్రామాలకు సాగునీరు రాకుండా కొందరు అడ్డగిస్తున్నారని కొండపాక మండలం చెందిన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తపాస్ పల్లి రిజర్వాయర్ నుంచి కొండపాక మండలంలోని పలు గ్రామాలకు సాగునీరు అందించే కాలువలు నిర్మించారు. గత మూడు నాలుగు సంవత్సరాల నుంచి చెరువులు కుంటలను నింపుతున్నారు. ఈ మధ్య కాలంలో మండలానికి సాగునీరు రాకపోవడంతో చెరువులన్నీ ఎండిపోయాయి. తపాస్ పల్లి నుంచి కొండపాక మండలానికి వచ్చే తిమ్మారెడ్డిపల్లి ప్రాంతంలోని కాలువ వద్ద కొమురవెల్లి , చేర్యాల ప్రాంతానికి చెందినవారు మట్టి కుప్పలు పోసి నీరు రాకుండా చేశారని మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. నీరు ఎందుకు రావడం లేదో తెలుసుకోవడం కోసం ఆదివారం ఆ ప్రాంతానికి వెళ్లి చూసేసరికి కొండపాక మండలానికి వచ్చే కాలువ వద్ద నీరు రాకుండా మట్టితో నింపారని తెలిపారు. మట్టి నింపడంతో అక్కడ నీరు విడుదల చేసినప్పటికీ కొండపాక పరిసర ప్రాంతాలకు నీరు రాకుండా నిలిచిపోయాయి. సంబంధిత అధికారుల స్పందించి కొండపాక మండలానికి సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఘనంగా సిటిజన్స్ క్లబ్ కార్యవర్గం ప్రమాణ స్వీకారం



నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్

గజ్వేల్ సిటిజన్స్ క్లబ్ నూతన పాలకవర్గం క్లబ్ ఘనంగా ప్రమాణ స్వీకార మహోత్సవ నిర్వహించారు. ఆదివారం సిటిజన్ క్లబ్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, మున్సిపల్ చైర్మెన్ రాజమౌళి, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి పాల్గొని మాట్లాడారు. సిటిజన్స్ క్లబ్ నూతన అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికైన నాయిని యాదగిరి కార్యవర్గ సభ్యులకు అభినందనలు తెలిపారు. సమాజ సేవలో సిటిజన్స్ క్లబ్ ముందు వరుసలో ఉంటూ పలువురికి ఆదర్శంగా నిలవాలన్నారు. సీనియర్ సిటిజన్స్‌తో మూడు దశాబ్దాలుగా గజ్వేల్‌లో ఒక సమూహంగా ఏర్పాటు అయి అన్ని వర్గాల వారు ఓకే వ్యవస్థగా సిటిజన్స్ క్లబ్ ఏర్పాటు చేసుకుని ముందుకు సాగడం అభినందనీయం అని అన్నారు. కార్యక్రమంలో గజ్వేల్ సిటిజన్స్ క్లబ్ అధ్యక్షులు నాయిని యాదగిరి, ఉపాధ్యక్షులు నల్ల సీతారామ మూర్తి, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ రెడ్డి, సంయుక్త కార్యదర్శి దుంభాల భూపాల్ రెడ్డి, కోశాధికారి సుధాగాని మల్లయ్య గౌడ్, క్రీడల కార్యదర్శి గంగాల నరేష్, ప్రధాన ఎన్నికల అధికారి అమర నాగేందర్, అర్సం శ్రీనివాస్, రమేష్, సిటిజన్స్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

హుస్నాబాద్‌లో పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



నవతెలంగాణ-హుస్నాబాద్‌రూరల్

నేటి(సోమవారం) నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు జరగనున్న పదో తరగతి పరీక్షల నిర్వహణకు అధికారులు ఆదివారం ఏర్పాట్లను పూర్తి చేశారు. ఈ పరీక్షలకు 22 పాఠశాలలకు చెందిన 822 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. ఇందులో బాలురు 396 మంది. బాలికలు 426 మంది ఉన్నారు. మొత్తం 4 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. హుస్నాబాద్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, ఆదర్శ పాఠశాల, టి ఎస్ ఎస్ డబ్ల్యూ ఆర్ ఎస్ బాలుర పాఠశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఒక్కో కేంద్రానికి ఒక చీఫ్ సూపెరిండేంట్(సి ఎస్), ఒక డిపార్ట్మెంట్ ఆఫీసర్స్(డి ఓ) మరియు 4 సెంటర్స్ కలిపి మొత్తం 47 మంది ఇన్విజిలెటర్స్ విధులు నిర్వర్తిస్తారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు ఉంటాయని ఎంఈఓ దేశి రెడ్డి పేర్కొన్నారు. పరీక్ష రాసే విద్యార్థులు ఉదయం 8.30 గంటలకల్లా పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని పరీక్షల విభాగం స్పష్టం చేసింది. 9.30 గంటలకు పరీక్ష ప్రారంభమవుతుందని, మరో ఐదు నిమిషాల వరకు విద్యార్థులను అనుమతిస్తామని తెలిపారు.

లద్నూర్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నవతెలంగాణ-మద్దూరు

మండలంలోని లద్నూర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో చదువుకున్న 1998-1999 పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులకు పూర్వ విద్యార్థులు శాలువా, మెమొంటోలతో ఘనంగా సత్కరించారు. అనంతరం తమ తమ తీపి గుర్తులను నెమర వేసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కిష్టయ్యపల్లిలో గాలిపోచమ్మ జాతర



నవతెలంగాణ-జిన్నారం

మండల పరిధిలోని కిష్టయ్యపల్లిలో ఆదివారం గాలి పోచమ్మ జాతర ఉత్సవాలను గ్రామస్తులు ఆలయ కమిటీ ప్రతినిధులు ఘనంగా నిర్వహించారు. ఈ జాతర ఉత్సవాల్లో సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్, జిన్నారం మండల పార్టీ కాంగ్రెస్ అధ్యక్షులు వడ్డే కృష్ణ నేతలు శ్రీనివాస్ ఎంపీటీసీ జానా బాయ్, కొత్తపల్లి శ్రీనివాస్‌రెడ్డి బృందం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. కిష్టయ్యపల్లి చుట్టుపక్కల గ్రామాల వారు స్థానిక నాయకులు వివిధ పార్టీల శ్రేణులు గాలి పోచమ్మ జాతరలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

దామోదర్ గెలుపుతో మొక్కు తీర్చుకున్న కాంగ్రెస్ నాయకులు



నవతెలంగాణ-జోగిపేట

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ గెలుపుతో జోగిపేట పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు విజయవాడ కనదుర్గాదేవి ఆలయంలో ఆదివారం మొక్కు చెల్లించుకున్నారు. ఎన్నికల ముందు కనకదుర్గాదేవిని దర్శించుకున్న వారు.. దామోదర గెలిస్తే మళ్లీ ఆలయానికి వచ్చి పూజలు చేస్తామని మొక్కుకున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం విజయవాడ వెళ్లి మొక్కు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చిట్యాల మధు, ఉల్వల సతీష్, రాజు, భాస్కర్, రాజశేఖర్, కృష్ణ, మురళి, అనిల్, నందు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్‌తోనే ప్రజాసంక్షేమం

నవతెలంగాణ-న్యాల్‌కల్

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే ప్రజలకు సంక్షేమం అందుతుందని కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్ అన్నారు. న్యాల్‌కల్ మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో అయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సురేష్ షెట్కార్, మాజీ మంత్రి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో వైస్ ఎంపీపీ గౌసోద్దిన్ రఫీయోద్దిన్‌తోపాటు అత్నూర్, వడ్డి ఆయా గ్రామాలకు చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరారు. ముందుగా సురేష్ షెట్కర్‌ను కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు డప్పు చప్పుల మధ్య చర్చి నుంచి శివాజీ చౌక్ వరకు ర్యాలీగా స్వాగతించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కర్ కాంగ్రెస్ మాజీ మంత్రి చంద్రశేఖర్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, రాములు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొత్తపల్లి భాస్కర్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తిరుపతి రెడ్డి, సిద్ధి లింగయ్య స్వామి, శివరాజ్ పాటిల్, కాశీనాథ్, ఆయా గ్రామాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

అక్రమ కేసులు, ఆస్తుల విధ్వంసం అప్రజాస్వామికం

- నిరుపేదల ఆస్తుల ధ్వంసం సరికాదు
- పటాన్చెరు ఎమ్మెల్యే జీఎంఆర్



నవతెలంగాణ-జిన్నారం

ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయాలు చేయాలి తప్పా.. తమ పార్టీలో చేరికల కోసం అక్రమ కేసులు, ఆస్తుల విధ్వంసాలతో ఒత్తిళ్లకు గురి చేయడం కాంగ్రెస్ పార్టీకే చెల్లిందని.. ఇది పూర్తిగా అప్రజాస్వామికం అని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. జిన్నారం మండలం మాదారంలో కూల్చివేతకు గురైన పలు భవన నిర్మాణాలను పరిశీలించి.. బాధితులను సంగారెడ్డి జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కుంచాల ప్రభాకర్, బీఆర్ఎస్ రాష్ట్ర నేత జిన్నారం వెంకటేశం గౌడ్, మాదారం గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ సరితా సురేందర్ గౌడ్, జిన్నారం మండల పార్టీ అధ్యక్షులు రాజేష్, మాదారం గణేష్ బృందంతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు బీఆర్ఎస్ శ్రేణులు తాము కట్టుకున్న ఇండ్లను కూల్చివేసారని, బీఆర్ఎస్‌కు చెందిన నాయకులు, కార్యకర్తల భవనాలను అక్రమ నిర్మాణాలనే నెపంతో కూల్చివేస్తున్నారని ఎమ్మెల్యే దృష్టికి పలువురు బీఆర్ఎస్ నాయకులు, బాధితులు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఆర్ఎస్ కార్యకర్తలు అధైర్య పడొద్దని, పార్టీ అండగా ఉంటుందని, వ్యక్తిగతంగా తాను ఆర్థిక సాయం అందజేస్తానని భరోసానిచ్చారు. తాత ముత్తాతల నుంచి వస్తున్న సొంత స్థలాల్లో జీవనాధారం కోసం దుకాణాల సముదాయాలు నిర్మించుకుంటే.. కక్షపూరితంగా అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు అధికారులకు ఫిర్యాదులు చేసి అక్రమంగా కూల్చి వేయించడం సరికాదన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలు మారడం సహజవని, అధికారులు ఒత్తిళ్లకు తలోగ్గకుండా నిక్షపాతంగా పనిచేయాలన్నారు. అధికారంలోకి వచ్చి 3 నెలల్లోనే ప్రతిపక్షాలను అణిచివేయాలని చూడడం సిగ్గుచేటన్నారు.



సీసీరోడ్లకు పంచాయతీ ట్యాంకర్ల ఉపయోగం

నవతెలంగాణ-పుల్కల్

గ్రామాల్లో వేస్తున్న సీసీరోడ్ల పనుల కోసం పంచాయతీకి చెందిన వాటర్ ట్యాంకర్‌లను ఉపయోగించడం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల ఆవరణలో బస్వాపూర్ గ్రామానికి చెందిన ఓ కాంగ్రెస్ నాయకుడు సీసీరోడ్డును వేస్తున్నారు. అయితే ఆ రోడ్డు నిర్మాణం కోసం గ్రామ పంచాయతీకి చెందిన వాటర్ ట్యాంకర్‌లను ఉపయోగించడం పట్ల స్థానికులు మండిపడుతున్నారు. కాంట్రాక్టర్లు ప్రైవేటు వాహనాలను వాడుకోవాలి కానీ.. పంచాయతీ ట్రాక్టర్లు ఎలా వాడుతారని ప్రశ్నిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పంచాయతీ ట్యాంకర్‌లను ఉపయోగించకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



రాష్ట్ర ఫిలిం డెవలప్మెంట్ సంస్థ చైర్మెన్‌కు సన్మానం

నవతెలంగాణ-జహీరాబాద్

తెలంగాణ రాష్ట్ర ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సంస్థ చైర్మెన్‌గా ఎన్నికైన యస్.గిరిధర్‌రెడ్డిని జహీరాబాద్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. హైదరాబాద్‌లోని అయన స్వగృహంలో ఆదివారం కలిసి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గిరిధర్ రెడ్డి మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తనకు ఈ పదవి దక్కడం సంతోషంగా ఉన్నదన్నారు. జహీరాబాద్ నియోజకవర్గ అభివృద్ధి, రాష్ట్ర అభివృద్ధిలో తనవంతు పాత్ర పోషిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, ఎన్ఎస్‌యూఐ నాయకులు, కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి



- ఎస్సీ విభాగం రాష్ట్ర కన్వీనర్ దండోరా నరసింహ
- రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మెన్‌గా నియమితులైన నాగరిగారి ప్రీతంకు సన్మానం

నవతెలంగాణ-పటాన్‌చెరు

కాంగ్రెస్ పార్టీతోనే తెలంగాణ రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందుతుందని ఎస్సీ విభాగం టీపీసీసీ రాష్ట్ర కన్వీనర్ దండోరా నరసింహ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మెన్‌గా నియమితులైన నాగరిగారి ప్రీతంని ఆదివారం ఎస్సీ విభాగం టీపీసీసీ రాష్ట్ర కన్వీనర్ దండోరా నరసింహ మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరు గ్యారెంటీ పథకాలతో ప్రజలకు లబ్ధి చేకూరుతుంద న్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషితో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని ఆశాభవం వ్యక్తం చేశారు. జిల్లా మంత్రి దావెదర రాజనర్సింహ, పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కాట శ్రీనివాస్ గౌడ్‌ల సలహాల సూచనలతో కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి పని చేస్తున్నామన్నారు. ప్రతీ కాంగ్రెస్ కార్యకర్త సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ విభాగం నాయకులు బంగారిగాళ్ల శ్రీనివాస్, వెంకటేష్, బంగారిగాళ్ల రవి తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మ తల్లి ఆలయంలోఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-సదాశివపేట

మండలంలోని రేజింతల్ గ్రామంలో గల పెద్దమ్మ తల్లి మందిరంలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. సదాశివపేట మండల మాజీ ఎంపీపీ అధ్యక్షురాలు పెద్దగొల్ల మల్లమ్మ కుటుంబ సభ్యులు నిర్వహించిన పెద్దమ్మతల్లి పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. నియోజకవర్గ ప్రజలు ఎల్లప్పుడూ సుబిక్షంగా ఉండాలని పెద్దమ్మతల్లిని కోరుకున్నట్టు ఎమ్మెల్యే చెప్పారు. ప్రజా సేవ చేయడమే పరమావధిగా భావించిన పెద్దగొల్ల మల్లమ్మను అభినంధిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గడిల సుధీర్ రెడ్డి, పార్టీ మండలాధ్యక్షులు పెద్దగొల్ల ఆంజనేయులు, మాజీ సర్పంచులు లక్ష్మారెడ్డి, గడ్డమీది సత్యనారాయణ, పెద్ద గొల్ల శ్రీహరి, తొంట రాజు, చోటు, పండరి, వీరయ్య, శ్రావణి, పావని, మల్లేశం, జమ్రుతిమియా, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



రూట్ వాహనాలు ప్రారంభం

నవతెలంగాణ-జోగిపేట

పార్లమెంటు ఎన్నికల నియమావళిలో భాగంగా అందోల్ నియోజకవర్గానికి చెందిన రూటు వాహనాలను జోగిపేట ఆర్డీవో పాండు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జెండా ఊపి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్లమెంటు ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన సందర్భంగా రూట్ వాహనాలు ఎన్నికల నియమావలిలో భాగంగా తనిఖీలు చేపడుతారన్నారు. ఈ కార్యక్రమంలో అందోల్ తహసీల్దార్ భాస్కర్ కుమార్, ఉప తహసీల్దార్ మధుకర్ రెడ్డి,ఎస్సై-1 అరుణ్‌కుమార్‌గౌడ్, ఎస్సై-2మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.

ధరణి భూ సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-పటాన్‌చెరు

ధరణి భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు ఎండి వాజీద్ అలీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని శ్రామిక్ భవన్‌లో ఆదివారం జరిగిన పార్టీ పటాన్‌చెరు ఏరియా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో పెండింగ్‌లో వున్న ధరణి భూ సమస్యలను పరిష్కరిం చాలని డిమాండ్ చేశారు. పటాన్‌చెరు, అమీన్‌పూర్, జిన్నా రం, గుమ్మడిదల, రామచంద్రపురం మండలాల్లో వేలాది దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ప్రత్యేక డ్రైవ్ పేరుతో ధరణి భూ సమస్యలను పరిష్కరి స్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని.. కానీ ఆ దిశగా చర్యలు తీసుకో లేదన్నారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ పేరుతో ధరణి భూ సమ స్యలు మూడు నెలల వరకు పెండింగులో ఉండే అవకాశం ఉందన్నారు. ఇది వరకే ధరణి భూ సమస్యల కోసం దరఖాస్తులు స్వీకరించారు కాబట్టి.. వాటిని వెంటనే పరిష్కరి ంచాలని డిమాండ్ చేశారు. సంక్షేమ పథకాలు పెన్షన్లు, జీరో కరెంట్ బిల్లులు, ఇందిరమ్మ ఇండ్ల పథకం, మహిళ చేయూత పథకాలు యథావిధిగా కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు బి.నాగేశ్వరరావు, బి.అర్జున్, రామచంద్రమూర్తి, విశాల్ పాల్గొన్నారు.

భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా క్రికెట్ టోర్నమెంట్



నవతెలంగాణ-సదాశివపేట

షాహిద్ భగత్‌సింగ్ 93వ వర్ధంతి వారోత్సవాల సందర్భంగా సంగారెడ్డి జిల్లా సదాశివపేటలో ఆదివారం క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌ను మాజీ ఎస్ఎఫ్ఐ జిల్లా నేత వి. ప్రవీణ్ టాస్‌వేసి మ్యాచ్ ప్రారంభించగా.. డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అనిల్ అన్ని టీములకు కంగ్రాట్యులేషన్ చెప్పారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మహేష్, నల్లవల్లి రమేష్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అనిల్ మాట్లాడుతూ.. స్వతంత్ర యోధుడు, విప్లవ కెరటం భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించినట్టు చెప్పారు. ఈ టోర్నమెంట్‌లో ఎనిమిది టీంలు పాల్గొన్నాయన్నారు. యువకుల్లోని సృజనాత్మకతను వెలికితీయడం కోసం, యువతకు మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం కల్పించడం కోసం ఈ టోర్నమెంట్ నిర్వహించినట్టు చెప్పారు. నేటి యువతరం మత్తు పదార్థాలకు బానిసై తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. కొంతమంది పాలకులు ఆదాయం కోసం గంజాయి, డ్రగ్స్ లాంటి మత్తు పదార్థాలతో వ్యాపారం చేస్తూ యువతులను పాడు చేస్తున్నారన్నారు. యువకులు ఇలాంటి మత్తు పదార్థాలకు బానిసవ్వొద్దు అన్నారు. భగత్‌సింగ్ స్ఫూర్తితో దేశభక్తిని పెంపొందించుకోవాలన్నారు. మత్తు పదార్థాలు బ్యాన్ చేసే విధంగా ఉద్యమాలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు ప్రశాంత్, కేవీపీఎస్ నాయకులు ప్రవీణ్, నిర్వాహక బృందం మహేష్, చిన్న, వీరు, క్రీడాకారులు పాల్గొన్నారు.



శివాలయం వద్ద బోరు ఏర్పాటు

నవతెలంగాణ-జిన్నారం

మండల కేంద్రమైన జిన్నారంలో నూతనంగా నిర్మిస్తున్న జీవన జ్యోతిర్లింగ శివాలయం వద్ద ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామస్తులు మంచినీటి సౌకర్యం కోసం ఆదివారం బోరు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, నాయకులు ప్రతాప్ రెడ్డి, రాజిరెడ్డి, పుట్టి భాస్కర్, గాండ్ల శ్రీనివాస్, వడ్ల శ్రీధర్ చారి, బుక్క శ్రీకాంత్, ప్రభాకర్, లక్ష్మణ్, ఫణి, నీలం రాము, పల్నాటి భాస్కర్, శ్రీకాంత్, రాజేందర్ బృందం పాల్గొన్నారు.

కార్మిక రంగానికి అండగా నిలిచే పార్టీకే మా మద్దతు



నవతెలంగాణ-పటాన్‌చెరు

రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో కార్మిక రంగానికి అండగా నిలిచే పార్టీకే తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని, కార్మిక వ్యతిరేకి బీజేపీని ఓడించాలని హింద్ మజ్దూర్ సంఘ్ (హెచ్ఎంఎస్) రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. పటాన్‌చెరు పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన హెచ్ఎంఎస్ రాష్ట్ర కమిటీ సమావేశంలో హెచ్ఎంఎస్ జాతీయ కార్యదర్శి సుదర్శన్ మాట్లాడుతూ.. ఈఎస్ఐ సంస్థలో కార్మికుల కష్టార్జితంతో పోగు చేసుకున్న రూ.2000 కోట్ల ఫిక్స్‌డ్ డిపాజిట్ నిధులను వెంటనే విడుదల చేసి ఈఎస్ఐ ఆసుపత్రుల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్మిక రంగం ఉనికికే ప్రశ్నార్థకంగా మారిన నాలుగు కార్మిక చట్టాలను వెంటనే ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. ప్రతీ అసంఘటితరంగా కార్మికుడికి పదివేల రూపాయల పెన్షన్ అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రాబోయే లోక్సభ ఎన్నికల్లో కార్మిక సంక్షేమానికి కృషి చేసే పార్టీలకు ఓటు వేయాలని, మతతత్వ నినాదంతో కార్మిక వ్యతిరేక చట్టాలను రూపొందిస్తున్న బీజేపీని ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో హెచ్ఎంఎస్ వైస్ ప్రెసిడెంట్ నర్సయ్య, జనరల్ సెక్రెటరీ రెబ్బ రామారావు, కార్యదర్శి ఈశ్వర్ ప్రసాద్, కోశాధికారి భాగ్యవతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఈదురుగాలులతో అకస్మాత్తు వర్షం



నవతెలంగాణ-న్యాల్‌కల్

వేసవికాలం ఎండతో ఉక్కిరిబిక్కిరి అయిన మండల ప్రజలకు ఆదివారం ఈదురుగాలులతో కురిసిన వర్షం కాసింత ఉపశమనాన్ని ఇచ్చింది. మండలంలోని న్యాల్‌కల్, చాల్కి, టేకుర్, చినిగేపల్లి, గంగావార్‌తో పాటు పలు గ్రామాల్లో ఒక్కసారిగా మేఘాలు కమ్మేసి ఈదురు గాలులతో వర్షం పడింది. అయితే ఈదురు గాలుల వల్ల మొక్కజొన్న పంట నేలకొరిగిందని రైతులు వాపోయారు. అధికారులు పంట పొలాలను పరిశీలించి ఆదుకోవాలని కోరుతున్నారు.

మరోపక్క వర్షం ఎప్పుడు పడినా మండలంలో కరెంటు కోతల వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. గంటల తరబడి కరెంటు నిలిచిపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డుపైనే నేలకొరిగిన చెట్టు..

అల్లాదుర్గం-మెటల్‌కుంట రోడ్డులోని ముంగి గ్రామ శివారులో భారీ ఎదురు గాలులకు ఓ చెట్టు రోడ్డుపైనే నేలకొరిగింది. దాంతో రాకపోకలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.





పెద్దమ్మ గూడెంలో మల్లన్న జాతర

నవతెలంగాణ-జిన్నారం

మండల పరిధిలోని పెద్దమ్మగూడెం గ్రామంలో భ్రమరాంబ మల్లికార్జున స్వామి జాతర ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లన్న స్వామి కల్యాణోత్సవ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు, యాదవ సోదరుల బృందం భారీగా అన్నదాన కార్యక్రమాలను చేపట్టారు. వివిధ పార్టీల నాయకులు, యువకులు, మహిళలు వివిధ గ్రామాల నుంచి భారీగా జాతర ఉత్సవాలకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జిన్నారం ఎంపీటీసీ వెంకటేశం గౌడ్, గొర్ల శ్రీనివాస్ యాదవ్, హిందూ జాగృతి సమితి కన్వీనర్ వడ్ల ఆనంద్, దుబ్బాక మహేష్ యాదవ్, ఎల్లన్న గారి వెంకటేష్ యాదవ్, బిక్షపతి, పూలపల్లి మహేష్ యాదవ్, ప్రహల్లాద యాదవ్ పెద్దమ్మ గూడెం యాదవుల బృందం పాల్గొన్నారు.

నేటి నుంచే పది పరీక్షలు

- ప్రతీ పాఠశాల శతశాతం ఉత్తీర్ణత సాధించాలి
- మండల విద్యాధికారి డి అంజయ్య



నవతెలంగాణ-పుల్కల్

పదో తరగతి పరీక్షలు నేటి(సోమవారం) నుంచే ప్రారంభం కానున్నాయి. మండలంలో పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని మండల విద్యాధికారి డి.అంజయ్య తెలిపారు. ప్రతీ పాఠశాల శతశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. నేటి నుండి ఈనెల 30వ తేదీ వరకు పరీక్షలు కొనసాగుతాయన్నారు. కాబట్టి విద్యార్థులు సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండి.. సబ్జెక్టుల వారిగా ప్రిపేర్ కావాలన్నారు. పుల్కల్ ఉమ్మడి మండలంలో చౌటకూర్, శివంపేట, సింగూర్ గురుకుల, బస్వాపూర్ గ్రామశివారులో గల ఆదర్శ పాఠశా లలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామ న్నారు. ఉమ్మడి మండలంలో సుమారు 600 మంది పదో తరగతి విద్యార్థులు ఉన్నారని.. అందులో ఏ ఒక్కరూ గైర్హాజ రు కావొద్దన్నారు. ప్రతీ ఒక్కరూ మంచిగా పరీక్ష రాసి.. ఉత్తమ మార్కులు పొందాల న్నారు. ఉత్తమ ప్రతిభను కనబరిచి ఉమ్మ డి మండలాన్ని జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిపేం దుకు ప్రతీ ఒక్క విద్యార్థి కృషి చేయాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు కావాల్సిన కనీస మౌలిక వసతులు కల్పి ంచామన్నారు. ప్రతీ సెంటర్లో ఇద్దరు ఏఎస్ఎంలను నియ మించినట్టు చెప్పారు. మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువు లకు అనుమతి లేదన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ ఉంటుందన్నారు.

వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే



నవతెలంగాణ-నిజాంపేట

మండల కేంద్రానికి చెందిన గందె లింగమూర్తి కుమారుడు విగ్నేష్ వివాహానికి మెదక్ మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రమేష్ రెడ్డి, రామయంపేట ఉమ్మడి మండలాల వైశ్య సంఘం అధ్యక్షులు సుధా మల్లేశం, రవీందర్ రెడ్డి, ఎంఎస్ఎస్ఓ మండల ఇన్చార్జి వెల్దుర్తి వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన రఘునందన్‌రావు



నవతెలంగాణ-నిజాంపేట: మండల పరిధిలోని చల్మెడ గ్రామానికి చెందిన జూపల్లి సుగుణ, కే.శే సత్యాగౌడ్ దంపతుల కుమారుడు, బీజేపీ బూత్ అధ్యక్షుడు సందీప్ గౌడ్ వివాహం ఆదివారం జరిగింది. ఈ వివాహ వేడుకకు మాజీ ఎమ్మెల్యే, మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్చార్జ్, జెడ్పీటీసీ పంజా విజయ్ కుమార్, మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, శంకర్, నరేష్ మహంకాళి, గేరిగంటి బాబు, జీపి స్వామి,చేర్వీరాల చంద్రశేఖర్,లారా, బొమ్మెన మల్లేశం, మధు తదితరులు పాల్గొన్నారు.

కరెంటు షాక్‌తో రైతు మతి



నవతెలంగాణ-నిజాంపేట

వ్యవసాయం పొలం వద్ద ప్రమాదవశాత్తు విద్యుద్ఘాతానికి గురై రైతు మృతి చెందాడు. ఈ ఘటన నిజాంపేటలో ఆదివారం జరిగింది. మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజాంపేట గ్రామానికి చెందిన బక్కోళ్ల మల్లయ్య(46) పంటకు నీరు పెట్టడం కోసం ఆదివారం ఉదయం దాదాపు ఐదు గంటలకు గ్రామ శివారులోని గల తన పొలం వద్దకు వెళ్లారు. అయితే పొలానికి చుట్టూ వేసిన సోలార్ ఫెన్సింగ్ తీగపై ఈదురు గాలుల వల్ల ప్రమాదవశాత్తు 11కె.వి తీగ తెగిపడింది. అది గమనించకపోవడంతో సోలార్ ఫెన్సింగ్‌కు మల్లయ్య తలగగానే ఒక్కసారిగా కరెంట్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని భార్య భార్య ఎల్లవ్వ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్నికల నియమావళి అమలు

నవతెలంగాణ-నిజాంపేట



నిజాంపేట గ్రామంలో గ్రామ కార్యదర్శి నర్సింలు కారోబార్ కొండల్ రెడ్డి , నందిగామ గ్రామంలో గ్రామ కార్యదర్శి మహమ్మద్ అరిఫ్ హుస్సేన్, వారి ఆధ్వర్యంలో ఎన్నికల కోడ్ అమలు కోసం చర్యలు చేపట్టారు. గ్రామాల్లో గోడ రాతలు, పోస్టర్లు, ఫ్లెక్సీలు, కటౌట్లు, బ్యానర్లు, రాజకీయ నాయకుల పోస్టర్లు అన్ని తొలగించినట్టు వారు తెలిపారు. నేటి నుంచి ఎన్నికల నియమావళి వర్తిస్తుందని..దాన్ని గ్రామస్తులు గమనించాలన్నారు.

నిరుపేద కుటుంబానికి చంద్రకళ లక్ష్మణ్ చారిటబుల్ ట్రస్ట్ చేయూత

- మంగలి నర్సింలు కుటుంబానికి ఆపన్న హస్తం

నవ తెలంగాణ -గజ్వేల్



గజ్వేల్ లోని నిరుపేద మంగలి నర్సింలు అనారోగ్య పరిస్థితి మీడియాలో వచ్చిన కథనానికి చలించిన తలకొక్కుల చంద్రకళ లక్ష్మణ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీరామ్ నర్సింలు కుమారుడు రాజేష్ కు తలకొక్కుల దుర్గాప్రసాద్ చేతుల మీదుగా తక్షణ సహాయంగా 2000 రూపాయలు అందజేశారు. ఈ సందర్భంగా తలకొక్కుల దుర్గాప్రసాద్ మాట్లాడుతూ శ్రీరామ్ నర్సింలు కుటుంబాన్ని ఆదుకోవడానికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని అలాగే నిరుపేద కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలని కోరుకుంటూ భవిష్యత్తులో శ్రీరామ్ నర్సింలు కుటుంబానికి మా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సహాయం అందజేయడం జరుగుతుందని అన్నారు.

బీజేపీలో చేరిన పలువురు బీఆర్ఎస్ శ్రేణులు



నవతెలంగాణ-బెజ్జంకి

మండల కేంద్రానికి చెందిన పలువురు బీఆర్ఎస్ శ్రేణులు బీజేపీలో చేరినట్టు మండలాధ్యక్షుడు కొలిపాక రాజు ఆదివారం తెలిపారు.బీజేపీలో చేరిన పలువురు బీఆర్ఎస్ నాయకులకు బీజేపీ కిసాన్ మోర్చ రాష్ట్ర కార్యదర్శి కరివేద మహిపాల్ రెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.ఎంపీ ఎన్నికల్లో జాతీయ కార్యదర్శి బండి సంజయ్ ఎన్నికకు శాయశక్తుల కషి చేస్తామని బండిపెల్లి నరేశ్ అభిప్రాయం వ్యక్తం చేశారు.నాయకులు గైని రాజు, బండిపెల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పదవ తరగతి విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాసి మంచి ఫలితాలు సాధించాలి.

- జిల్లా బాలల సంక్షేమ సమితి సభ్యులు జాతీయ యువజన అవార్డు గ్రహీత దేశబోయిని నర్సింహులు .

నవతెలంగాణ- గజ్వేల్



నేటి నుంచి పదవ తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో పరీక్షలు వ్రాసే విద్యార్థిని, విద్యార్థులకు జిల్లా బాలల సంక్షేమ సమితి సభ్యులు జాతీయ యువజన అవార్డు గ్రహీత దేశబోయిని నర్సింహులు శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం నుంచి ప్రారంభం కానున్న పదవ తరగతి పరీక్షల నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలు రాసే విద్యార్థిని, విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని మీరు కష్టపడి చదివినదాన్ని ఇష్టంతో పరీక్షలలో రాసి మంచి ఉత్తీర్ణత సాధించాలని కోరుకుంటున్నానని పేర్కొన్నారు. అలాగే పదవ తరగతి మీ బంగారు భవిష్యత్తుకి ఇది పునాది లాంటిదని పరీక్షలు బాగా రాసి మీ తల్లిదండ్రులకు, గ్రామానికి మీరు చదివిన పాఠశాలకు మంచి పేరు తెచ్చి వారి కలలను నిజం చేయాలని ఆకాంక్షించారు.

పది పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి: ఎంఈఓ



నవతెలంగాణ-దుబ్బాక

ఈనెల 18 నుండి జరగనున్న పదవ తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని మండల విద్యాధికారి జోగు ప్రభుదాస్ చెప్పారు.మండల వ్యాప్తంగా ఏర్పాటుచేసిన 4 పరీక్ష కేంద్రాల్లో 815 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు.ఆదివారం దుబ్బాక లో ఆయన మాట్లాడారు.పురపాలిక కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో- 219 మంది,ఉన్నత పాఠశాల (కేసీఆర్ స్కూల్) లో -240 మంది, పురపాలిక పరిధిలోని లచ్చపేట వార్డులో గల మోడల్ స్కూల్ లో- 250 మంది,ఉన్నత పాఠశాలలో- 106 మంది, అక్బర్ పేట భూంపల్లి మండల పరిధిలోని పోతారెడ్డి పేట ఉన్నత పాఠశాలలో 106 మంది విద్యార్థులు పరీక్షలు రాసేలా ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. ఈ కేంద్రాల్లో విద్యుత్తు,త్రాగునీరు,మూత్రశాలలు వంటి సౌకర్యాలను సమకూర్చామన్నారు.ఈ పరీక్షల నిర్వహణకు నలుగురు చీఫ్ సూపర్ రిండెంట్లు,నలుగురు డిపార్ట్మెంటల్ ఆఫీసర్లు,43 మంది ఇన్విజిలేటర్లు,8 మంది సహాయకులను నియామకం చేయడం జరిగిందన్నారు.

'భగీరథ' పైప్‌లైన్ వల్ల నిలిచిన సీసీరోడ్డు పనులు

- వెంటనే పైప్‌లైన్‌ను ఫిట్ చేయాలని స్థానికుల వేడుకోలు

నవతెలంగాణ-నిజాంపేట

మండల పరిధిలోని నస్కల్ గ్రామంలో రూ.2 కోట్ల 17 లక్షలలతో సీసీరోడ్డు పనులను ప్రారంభించి దాదాపు మూడు నెలలు అవుతున్నది. అయితే సీసీరోడ్డు పనులు పూర్తి అయినప్పటికీ.. తీగల స్వామి గౌడ్ ఇంటి వద్ద గల మిషన్ భగీరథ పైప్‌లైన్ సరి చేయకపోవడం కొంతభాగం పెండింగ్ పెట్టాల్సి వచ్చింది. మిషన్ భగీరథ పైప్‌లైన్ వేసినట్లయితే అక్కడ సీసీరోడ్డు పూర్తి అయ్యేదని గ్రామస్తులు చెబుతున్నారు. అసంపూర్తి రోడ్డు వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. ట్రాక్టర్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలను ఊరు బయట నిలిపి గ్రామంలోకి కాలినడకన వచ్చే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మిషన్ భగీరథ అధికారులు స్పందించి పైప్‌లైన్ వేసేలా తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఇదే విషయమై సీసీరోడ్డు కాంట్రాక్టర్‌ను వివరణ కోరగా.. మిషన్ భగీరథ పైప్‌లైన్ సరిచేసిన వెంటనే సీసీరోడ్డు వేస్తామని చెప్పారు. అప్పటివరకు సీసీరోడ్డు వేయరాదని తెలిపారు.

వెంటనే మిషన్ భగీరథ పైపులు సరి చేయాలి

తీగల స్వామిగౌడ్ ఇంటి వద్ద సీసీరోడ్డు లేక నానా ఇబ్బందులు పడుతున్నాం. బైక్‌లు ఈ రోడ్డుగుండా వెళ్లలేక పోవడం వల్ల ఊరు బయటే





వాహనాలను నిలిపి.. నడుచుకుంటూ ఊర్లోకి వస్తున్నాం. ఈ పరిస్థితి వల్ల దాదాపు నాలుగు నెలల నుంచి చాలా ఇబ్బందులు పడుతున్నాం. వెంటనే మిషన్ భగీరథ అధికారులు వెంటనే స్పందించి పైపులైను ఫిట్ చేయాలి

- రాచకొండ నర్సింలు, నస్కల్



మిషన్ భగీరథ అధికారుల నిర్లక్ష్యం.



మిషన్ భగీరథ పైప్‌లైన్ ఫిట్ చేయాలని అధికారులకు చెప్పినప్పటికీ.. నేటికీ బిగించలేదు. దాంతో సీసీరోడ్డు పనులు ఆగిపోయాయి. పైపులైన్లు ఫిట్ చేస్తేనే సీసీరోడ్డు వేస్తానని రోడ్డు కాంట్రాక్టర్ చెబుతున్నాడు. కాబట్టి సంబంధిత అధికారులు స్పందించి వెంటనే మిషన్ భగీరథ పైప్లైన్ వేయాలి.

- తంగెళ్లపల్లి బాలేశ, నస్కల్ గ్రామం

మతోన్మాద శక్తులను ఓడించి, లౌకిక శక్తులను గెలిపించండి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు

నవతెలంగాణ-మెదక్

వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు మతోన్మాద శక్తులకు ఓట్లు వేయకుండా లౌకిక శక్తులకు ఓట్లువేసి గెలిపించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు అన్నారు. ఆదివారం స్థానిక ప్రజా సంఘాల భవన్ (కేవల్ కిషన్ భవనం)లో పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. దేశంలో మతోన్మాద బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాస్వామ్యాన్ని లూటీ చేస్తూ, దేశ సంపద పుర్తిక కార్పొరేట్ వ్యక్తులకు, శక్తులకు దనదతం చేస్తుందన్నారు. మూఢ విశ్వాసాలు, అప్రజాస్వామికంగా పరిపాలన చేస్తూ దేశని బ్రస్తుపట్టిస్తుందని మండిపడ్డారు. అధికారంలోకి వస్తే నల్లధనం తెస్తానని చెప్పిన, సంవత్సరానికి కోటి ఉద్యోగాలు ఇస్తానని హామీ ఇచ్చిన అమలు చేయడంలో ఋజువులేదన్నరు. దేశంలో రాజకీయ అవసరాలకోసం మత కలోలాలు సష్టిస్తూ రాజకీయంగా లబ్ధి పొందుతుందన్నారు. భారత దేశం భినత్వంలో ఏకత్వంగా ఉన్న దేశంలో మతోన్మాద శక్తులను ఓడించల్సిన అవసరం ఉందని గుర్తుచేశారు. దేశం కోసం ప్రజలకోసం నిరంతరం పనిచేస్తున్న లౌకిక, ప్రజాస్వామ్య శక్తులను వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి మల్లేశం, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నర్సమ్మ మహేందర్ రెడ్డి, మల్లేశం, బస్వరాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు కడారి నాగరాజు, సంతోష్ నాయకులు అజెయ్, సత్యం



తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మెన్‌గాసుజాత గుప్తా ఎంపికపై హర్షం

నవతెలంగాణ-పాపన్నపేట

తెలంగాణ రాష్ట్ర ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్మన్‌గా కల్వ సుజాత గుప్తా నియమితురాలైన విషయం విధితమే. అయితే ఆమె నియామకం పట్ల పాపన్నపేట మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గజవాడ రాజేశ్వర్ గుప్తా, మండల ప్రధాన కార్యదర్శి బెజుగం విట్టలేశ్వర్ గుప్తా, ఏడు పాయల దేవస్థానం మాజీ చైర్మన్ పార్శీ నర్సింలు గుప్తా,పాపన్నపేట ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం(పిఏసిఎస్)చైర్మన్ గునిశెట్టి మల్లేశం గుప్తా,కొత్తపల్లి సొసైటీ చైర్మన్ త్యార్ల రమేష్ గుప్తా,చీకోడ్ సొసైటీ చైర్మన్ దత్తురాజు గుప్తా,ఆర్యవైశ్య సంఘం నాయకులు సింగారపు రమేష్ గుప్తా,సింగారపు శంకరయ్య గుప్తా,మునిగాల రాజేందర్ గుప్తా,కొవూరి రామకష్ణ గుప్తా,మదిరే వీరేశం గుప్తా,మరుమల్ల అశోక్ గుప్తా,మన్నెం రాజ్ కుమార్ గుప్తా,కుకుట్ల సత్యనారాయణ గుప్తా తదితరులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కల్వ సుజాత హయాంలో ఆర్య వైశ్యులకు సముచిత న్యాయం చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎప్పటి నుండో కన్న కలలు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని కులాల వారికి కార్పొరేషన్ లు ఏర్పాటు చేయడం హర్షణీయమని కొనియాడారు.



మృతి చెందిన గొర్రెల కాపరి కుటుంబాన్ని ఆదుకోవాలి

నవతెలంగాణ-నిజాంపేట

కరెంటు షాక్‌తో మృతి చెందిన గొర్రెల కాపరి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోచబోయిన శ్రీహరి యాదవ్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మృతి చెందిన బక్కోళ్ల మల్లయ్య కుటుంబాన్ని ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శనివారం రాత్రి ఈదురు గాలులకు వైర్లు తెగిపోయి కిందపడడంతో.. అది గమనించక వైరుకు తగలడంతో మల్లయ్య మృతి చెందాడన్నారు. ఆయన కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలన్నారు. ఆయన వెంట జిల్లా గొర్రెల కాపరుల



సంక్షేమ సంఘం అధ్యక్షులు దేవరాజు యాదవ్, యాదవ సంఘం నాయకులు పొగాల నగేష్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్, శ్రీశైలం యాదవ్, రాజయ్య యాదవ్, బట్టు మల్లేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పదవ తరగతి పరీక్షలు ప్రారంభం

- మాస్ కాపీ పాల్పడితే చర్యలు తప్పవు
- మండల విద్యాధికారి బండి నరసవ్వ

నవతెలంగాణ-దౌల్తాబాద్



మండలంలోని పదవ తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు మండలంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల దౌల్తాబాద్ మరియు మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల లింగరాజు పల్లి రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పరీక్షల నిర్వహణకు కావలసిన సిబ్బందిని చీఫ్ సూపరింటెంట్, డిపార్ట్మెంటల్ ఆఫీసర్స్ ని నిర్వహణకు సరిపడా ఇన్విజిలేటర్లను నియమించడం జరిగిందన్నారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కావలసిన ఫర్నిచర్ ను, త్రాగునీరు ఏర్పాటు చేశామన్నారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల దౌల్తాబాద్ నందు 220 మంది విద్యార్థులు అదేవిధంగా మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల యందు 212 మంది విద్యార్థులు మొత్తం రెండు పరీక్ష కేంద్రాలలో 432 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. విద్యార్థులు ఎటువంటి మానసిక ఆందోళన చెందకుండా ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాయాలని సూచించారు . ఈ కార్యక్రమంలో సూపరింటెంట్లు డిపార్ట్మెంటల్ ఆఫీసర్స్ రాజగోపాల్ రెడ్డి,వెంకటలక్ష్మి,చంద్రయ్య, లక్ష్మయ్య స్థానిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సి ఆర్ పి గాడి రాజుతోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

పదవ తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- మండల విద్యాశాఖ అధికారి నర్సవ్వ



నవతెలంగాణ-రాయపోల్



రాయపోల్ మండలంలో 10 వ తరగతి పరీక్షలు నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని మండల విద్యాశాఖ అధికారి నర్సవ్వ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాయపోల్ మండలంలోని పదవ తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించాలని సంబంధిత పరీక్షా కేంద్రాల అధికారులకు, ఇన్విజిలేటర్లకు సూచించడం జరిగింది అన్నారు. మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బేగంపేట్ లో బేగంపేట, వడ్డేపల్లి, రామారం, ఇందుప్రియాల్, బంగ్లా వెంకటాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు మొత్తం 188 మంది విద్యార్థులు మరియు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాయపోల్ నందు రాయపోల్, రాంసాగర్, అనాజీపూర్, ముబారస్ పూర్, తిరుమలపూర్, కేజీబీవీ రాయపోల్, సెయింట్ అన్సుస్ ముబారస్ పూర్ జిల్లా పరిషత్ ఉన్నంత పాఠశాలల విద్యార్థులు 217 మంది పరీక్షలు రాస్తున్నారు. 2 కేంద్రాలలో కలిపి 405 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. మార్చి 18 సోమవారం నుంచి పరీక్షలు ప్రారంభమవుతున్నాయి. కావున పరీక్ష కేంద్రాలను సందర్శించి తగు ఏర్పాట్లను పరిశీలించడం జరిగిందన్నారు.

అధికార యంత్రాంగం అండతో అక్రమ మట్టి దందా

- మట్టి వాహనాలను అడ్డుకున్న స్థానికుడు
- ప్రభుత్వ సెలవు రోజు మాఫీయాదారుల అక్రమ మట్టి రవాణ
- భారీ వాహనాలతో మట్టిరోడ్డు బురదమయం

నవతెలంగాణ-బెజ్జంకి: అధికార యంత్రాంగం అండతోనే మాఫీయాదారులు మండల కేంద్రంలో యథేచ్ఛగా అక్రమ మట్టి దందాను సాగిస్తున్నారని స్థానికులు అగ్రహం వ్యక్తం చేశారు. అదివారం ప్రభుత్వ సెలవు రోజున మాఫీయాదారులు ఎలాంటి అధికారుల అనుమతుల్లేకుండా యథేచ్ఛగా భారీ వాహనాలతో మట్టి రవాణ సాగించడాన్ని స్థానిక యువకుడు అడ్డుకున్నాడు.భారీ వాహనాలతో మట్టి రవాణ సాగించడం వల్ల దళిత కాలనికి వెళ్లే మట్టి రోడ్డు గుంతలతో బురదమయమై కాలనివాసులు ప్రమాదాలకు గురవుతున్నారని యువకుడు అవేదన వ్యక్తం చేశారు.అక్రమ మట్టి రవాణపై తహసిల్దార్ స్పదించడం లేదని జోరుగా సాగుతున్న అక్రమ మట్టి రవాణపై మండల అధికార యంత్రాంగం చట్టపరమైన చర్యలు చేపట్టాలని లేనిపక్షంలో మండల అధికారుల నిర్లక్ష్యంపై జిల్లా కలెక్టరుకు పిర్యాదు చేస్తామని యువకుడు హెచ్చరించారు. అక్రమ మట్టి రవాణపై తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డిని వివరణ కోరగా సంబంధిత మైనింగ్ శాఖ అధికారులే చర్యలు చేపట్టాలని తెలిపారు.



తెలంగాణ రజక సంఘాల సమన్వయ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గా విజయ్ గణేష్

నవతెలంగాణ-తొగుట



తెలంగాణ రజక సంఘాల సమన్వయ కమిటీ ప్రధాన కార్యదర్శి గా తననుఎంపిక చేసిన చైర్మన్, కమిటీ సభ్యులకు విజయ్ గణేష్ కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ రజక సంఘాల సమన్వయ కమిటీ రాష్ట్ర ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా రజక ముఖ్య నాయకులు పాల్గొని తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గా చిన్న రాంగారి విజయ్ గణేష్ ను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా విజయ్ గణేష్ మాట్లాడుతూ నన్ను ఎంపిక చేసినందుకు తెలం గాణ రజక సంఘాల చైర్మన్ బసవరాజ్ శంకర్, కమిటీ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా సంఘాలు ఎన్ని ఉన్నా "ఒకే సంఘం ఒకే నాయకుడు" రజక సంఘం ఒకటిగా పని చేస్తే నే ప్రభుత్వంతో కొట్లాడి హక్కులను సాధించుకు నేందుకు మేలు చేకూరుతుందని అన్నారు.

కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

- దౌల్తాబాద్ ఎస్సై శ్రీరామ్ ప్రేమ్ దీప్

నవతెలంగాణ-దౌల్తాబాద్



కోడ్ ఉల్లంఘిస్తే ఎంతటి వారి కైనా చర్యలు తప్పవని దౌల్తాబాద్ ఎస్సై శ్రీరామ్ ప్రేమ్ దీప్ అన్నారు. దేశవ్యాప్తంగా లోక్ సభ ఎన్నికల సందర్భంగా కోడు ఉన్న విషయాన్ని ప్రజలు గమనించాలన్నారు.ఎంతటి వారైనా ఎన్నికల కోడు ను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని వారు తెలిపారు.మండలంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రత్యేక పోలీస్ టీం లో గ్రామాలలో శాంతి భద్రతల కోసం పనిచేయడం జరుగుతుందని వారు తెలిపారు గ్రామాలలో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తులు కనబడేటట్లు అయితే మా పోలీస్ సిబ్బందికి సమాచారాన్ని అందించాలని మండల ప్రజలను కోరారు. అదే మాదిరిగా సోమవారం నుండి పదవ తరగతి పరీక్షలు జరుగుతాయి కావున పరీక్ష కేంద్రాల వద్ద 144 సెకన్ అమల్లో ఉంటుందన్నారు. అందుకోసం పరీక్ష కేంద్రాల సమీపంలో జిరాక్స్ నిజమైన దారులు వారి వారి దుకాణాలను తీయరాదని సూచించారు. పరీక్ష కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ చర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని అన్నారు.

నవతెలంగాణ 4
సమగ్ర తెలుగు దినపత్రిక
సిద్దిపేట
సోమవారం | 18 మార్చి 2024 | www.navatelangana.com

ఆరే సంక్షేమ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని..

- మంత్రి పొన్నంకు మండల ఆరే సంఘ నాయకుల వినతి

నవతెలంగాణ-బెజ్జంకి

రాష్ట్రంలోని ఆరే కులస్తుల సంక్షేమం కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుచేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆదివారం వినతి పత్రం అందజేసినట్టు మండల ఆరే సంఘం నాయకులు, బీఆర్ఎస్ నాయకులు ఏసిక శంకర్‌రావు తెలిపారు. మంత్రి సానుకూలంగా స్పందించి సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లే యత్నం చేస్తానని తెలిపినట్టు శంకర్‌రావు తెలిపారు.



బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మెన్‌కి శుభాకాంక్షలు

నవతెలంగాణ-సిద్దిపేట

తెలంగాణ బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మెన్‌గా నియమితులైన టీపీసీసీ ఓబీసీ సెల్ చైర్మెన్ నూతి శ్రీకాంత్ గౌడ్‌ని సిద్దిపేట జిల్లా ఓబీసీ సెల్ చైర్మెన్ డాక్టర్ సూర్య వర్మ కలిసి సన్మానించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. నూతి శ్రీకాంత్ గౌడ్‌ని కార్పొరేషన్ చైర్మెన్‌గా నియమించడం యువత రాజకీయ ప్రోత్సాహానికి ఉదాహరణ అని తెలిపారు. పార్టీ కోసం పని చేసిన ప్రతి ఒక్కరినీ తప్పక గుర్తించి సముచిత స్థానం కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు గరిపల్లి వెంకటి, బంక చిరంజీవి యాదవ్, మిద్దె ప్రసాద్, డీసీసీ ప్రధాన కార్యదర్శి మోతే కుమార్, దిలీప్ ఉన్నారు.



కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ.. రైతు బీమా కొనసాగింపు

నవతెలంగాణ-గజ్వేల్

కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతు బీమా పథకాన్ని గత ప్రభుత్వం మాదిరిగా అమలు చేయాలని నిర్ణయించడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. మంత్రివర్గం తీసుకున్న ఈ నిర్ణయంపై రైతుల్లో హర్షధ్వానాలు వ్యక్తమవుతున్నాయి. బాధిత రైతు కుటుంబాలకు ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సైతం రైతు బీమాను యథావిధిగా కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నట్టు అధికారులు చెబుతున్నారు. 2018 ఆగస్టు 18 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా గత ప్రభుత్వం ఈ పథకాన్ని అమలులోకి తెచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా 3 లక్షలకు పైగా రైతులుండగా.. రెండు సీజన్లు కలిపి ఏటా 6 లక్షలకు పైగా ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తున్నారు. వ్యవసాయ క్షేత్రాలకు రాకపోకల సమయంలో కీటకాలు, ప్రమాదాల బారిన పడి మత్యు వాత పడుతున్నారు. ఒక్కోసారి ప్రకతి విపత్తుల కారణంగా చనిపోతున్నారు. ఈ సందర్భంలో ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు బీమా రైతుబాధిత కుటుంబాలకు దన్నుగా నిలుస్తుందని వ్యవసాయ అధికారులు తెలిపారు. మృతిచెందిన రైతు కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందుతుంది. వార్షిక ప్రీమియం ప్రభుత్వమే చెల్లించేలా ఎలసీతో ఒప్పందం చేసుకుంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 18 నుంచి 59 ఏండ్ల లోపు ఉన్న పట్టా రైతులకు ఈ పథకం ద్వారా ప్రయోజనం దక్కనుంది. మృతి చెందితే కుటుంబీకుల ఆధార్ కార్డు, మరణ ధ్రువీకరణ పత్రం, ఖాతా, బ్యాంకు నామినీ పత్రాలు, తదితర సంబంధిత పత్రాలను సమర్పిస్తే.. వాటిని పరిశీలించి వ్యవసాయ విస్తరణ అధికారులు రైతుల ఖాతాలో డబ్బులు వేసే ప్రక్రియ చేపడతారు. ఈ ఏడాది ఇప్పటివరకు 589 కుటుంబాలకు పరిహారం అందిగా.. ఇంకా 109 కుటుంబాలకు మంజూరు కావాల్సి ఉంది. అదేవిధంగా జిల్లాలో 2018 సంవత్సరానికి 769 కుటుంబాలు, 2019లో 805 కుటుంబాలు, 2020లో 1269 కుటుంబాలు, 2021లో 1015 కుటుంబాలు, 2022లో 1059 కుటుంబాలు, 2023లో 589 కుటుంబాలు లబ్ది పొందారు.



ప్రజా నాయకుడిగా ఎదగాలి

- ఎఫ్డీసీ మాజీ చైర్మెన్ ప్రతాప్ రెడ్డి




నవతెలంగాణ -గజ్వేల్

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ 19వ వార్డు కౌన్సిలర్ గుంటుకు శిరీష రాజు ప్రజా నాయకుడిగా ఎదగాలని ఎఫ్డీసీ మాజీ చైర్మెన్ వంటేరు ప్రతాపరెడ్డి, మున్సిపల్ చైర్మెన్ నేతి చిన్న రాజమౌళి అన్నారు. ఆదివారం రాజు జన్మదిన సందర్భంగా ఆయన ఇంటికి వెళ్లి వారు ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వంటేరు మాట్లాడుతూ.. వ్యాపార రంగంతో పాటు రాజకీయాల్లోనూ మంచి గుర్తింపు పొందిన రాజు భవిష్యత్తులో ప్రజానాయకుడిగా ఎదగాలని ఆశిస్తున్నానని చెప్పారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్టీలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. రాజమౌళి మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో రాజు మరింతగా ఆర్థికంగా సామాజికంగా రాజకీయంగా ఎదగాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో పట్టణ నాయకులు నవాజ్ మీరా, మీడియా ఇంచార్జి హైమద్, స్వామి చారి, మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు గంగిశెట్టి చందనా రవీందర్, భాగ్యలక్ష్మి దుర్గ ప్రసాద్, బొగ్గుల చందు, ఉప్పల మెట్టయ్య, ములుగు సలీం, నాయకులు నవాజ్ మీరా, కూరాకుల సాయి, బాకీ స్వామి, ఉన్నారు.

భవిష్యత్‌కు పదవ తరగతి నాంది

- బీఆర్ఎస్ దుబ్బాక నియోజకవర్గం ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి



నవతెలంగాణ-దౌల్తాబాద్:

నేటి నుంచి నిర్వహించే పదవ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థినీ విద్యార్థులకు దుబ్బాక నియోజకవర్గం ఇన్‌చార్జి, మాజీ మంత్రి తనయుడు చెరుకు శ్రీనివాస్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. నియోజవర్గంలోని ఏడు మండలాల విద్యార్థులు పరీక్ష సమయపాలన పాటించి పరీక్షలు రాయాలన్నారు. పరీక్ష సమయానికి ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని, ప్రధానంగా దూర ప్రాంతంలో ఉన్న విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు దగ్గరలో ఉన్న తమ బంధువుల వద్ద ఉండాలని సూచించారు. 10వ తరగతి పరీక్షలు చదువులకు నాంది అవుతాయని అన్నారు. విద్యార్థులు పరీక్షలను భయంతో కాకుండా ఇష్టంగా రాయాలని తెలిపారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు ఎదగాలంటే పదవ తరగతి పరీక్షల్లో మంచి ప్రతిభను చూపించాలని విద్యార్థులకు తెలిపారు. ప్రతి పరీక్షాపత్రాలో అన్ని ప్రశ్నలకు సమాధానాలు రాయాలన్నారు. పదవ తరగతిలో 10/10 సాధించిన విద్యార్థిని విద్యార్థులకు ప్రత్యేక బహుమతులను అందజేస్తానని తెలిపారు. సమయం వృధా చేయకుండా చదివి మంచి భవిష్యత్తును సాధించినప్పుడే తమ తల్లిదండ్రులకు, చదువు చెప్పిన గురువులకు, గ్రామానికి మంచి పేరు వస్తుందన్నారు.

అన్ని సామాజిక తరగతులకు సీఎం పెద్దపీట

- గజ్వేల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు



నవతెలంగాణ -గజ్వేల్

అన్ని సామాజిక తరగతులకు సీఎం పెద్ద పీట వేయాలన్న లక్ష్యంతో పద్మశాలి కార్పొరేషన్ ఏర్పాటు చేశారని గజ్వేల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు నాగరాజు నేత, యువజన పద్మశాలి సంఘం, కాంగ్రెస్ నాయకులు ప్రేమ్ కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక పద్మశాలి భవనం వద్ద సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని సామాజిక తరగతులను బలోపేతం చేయాలని ప్రభుత్వం భావిస్తుందన్నారు. పద్మశాలి కార్పొరేషన్ ఏర్పాటు వల్ల అనేక లాభాలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో పద్మశాలి యువజన సంఘం అధ్యక్షులు తలకొక్కుల ప్రేమ్ కుమార్, యువజన సంఘం కోశాధికారి గుండు మల్లేశం, నాయకులు వడ్డేపల్లి రమేష్, గుండు చంద్రశేఖర్, బొల్లి సదానందం, సబ్బని చంద్రమౌళి, ఎడెల్లి మహేందర్, మెరుగు శ్రీనివాస్, పెండెం వెంకటేష్, దావత్ సతీష్, పెండెం కృష్ణ, దార సంతోష్, హనుమాన్ దాస్, షేర్ల నర్సింలు, సూరం లింగం, గుండు లక్ష్మణ్, గాడిపల్లి శ్రీనివాస్, వలం దాస్ సత్యనారాయణ, గాడిపల్లి అనూఫ్, ఎడెల్లి శ్రీనివాస్, చెప్యాల మల్లేశం, పాషికంటి శ్రీనివాస్, గాడిపల్లి బలరాం, దేవులపల్లి రాజారాం, మాదాసు జగదీష్, దొంతుల ప్రభాకర్, శివకుమార్, పోశెటి పాల్గొన్నారు.

చదువుల్లో పోటీ తత్వాన్ని అలవర్చుకోవాలి

నవతెలంగాణ-నంగునూరు

చదువుల్లో పోటీతత్వం అలవర్చుకొని ముందుకు వెళ్లాలని మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి సూచించారు. శనివారం రాత్రి నంగునూరు మండలం పాలమాకుల గ్రామంలోని లిటిల్ ఫ్లవర్ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో 13వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ కె.వర్గీస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి తగిరెడ్డి దేశిరెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో కంటే ప్రయివేటు పాఠశాల విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించి ముందంజలో ఉంటారని తెలిపారు. ఈ సంవత్సరం నిర్వహించిన వివిధ క్రీడా అంశాల్లో గెలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ రాగుల సారయ్య, గ్రామ సర్పంచ్ పంగ కుమార్, ఎంపీటీసీ ఏటీ తులసి పరమేశ్వర్, ఉప సర్పంచ్ ఓజాలు, ఉపాధ్యాయులు సింగాబట్టు రామరాజు, రాజమౌళి, డైరెక్టర్ పబ్బోజు సత్యం తదితరులు పాల్గొన్నారు.





మాదిగ, మాదిగ ఉపకులాల కార్పొరేషన్ ఏర్పాటు

- చేసినందుకు ముఖ్యమంత్రి గారికి కృతజ్ఞతలు
- ఎమ్మార్పీఎస్ టీఎస్ నాయకులు



నవతెలంగాణ-దౌల్తాబాద్

రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా మాదిగ, మాదిగ ఉపకులాలకు కార్పొరేషన్ ఏర్పాటు చేసేందుకు నిర్ణయం తీసుకున్నందుకు ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర అధ్యక్షులు మేడి పాపన్న మాదిగ, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల శ్రీనివాస్ మాదిగ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ ఆధ్వర్యంలో అనేక పోరాటాలు నిర్వహించామని తెలిపారు. కార్పొరేషన్ ద్వారా అసలైన లబ్దిదారులను ఎంపిక చేసి మాదిగ, మాదిగ ఉప కులాలకు న్యాయం జరిగేలా చూడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. అలాగే డప్పు, చెప్పు వృత్తిదారులకు రూ.2000ల పింఛన్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీలో పనిచేస్తున్న సఫాయి కార్మికులను వెంటనే రెగ్యులర్ చేసి వారి కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. మాదిగ, మాదిగ ఉప కులాలకు రాష్ట్రంలో రెండు పార్లమెంటు స్థానాలు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు జోగు మహేందర్ మాదిగ, ఉపాధ్యక్షులు సూరంపల్లి కుమార్ మాదిగ, ప్రధాన కార్యదర్శి డప్పు శ్రీనివాస్ మాదిగ, జిల్లా ఉపాధ్యక్షులు జంగాపల్లి సాయిలు మాదిగ, మండల సలహాదారులు కావేటి పూర్ణయ్య మాదిగ, సంచు వెంకటేష్ మాదిగ, అల్వాల స్వామి మాదిగ తదితరులు పాల్గొన్నారు.

కురుమలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

- నంగునూరు మండల కురుమ సంఘం అధ్యక్షులు, ఎంపీటీసీ బెదురు తిరుపతి



నవతెలంగాణ-నంగునూరు

కురుమలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని నంగునూరు మండల కురుమ సంఘం అధ్యక్షులు, ఎంపీటీసీ బెదురు తిరుపతి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కురుమ, యాదవ కలిపి ఒకే కార్పొరేషన్ వద్దని, కురుమలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుచేయాలని కోరారు. రాజకీయంగా, ఉద్యోగ పరంగా గొల్ల కులస్తులతో కురుమలను కలుపుతూ అన్యాయం చేయడం సబబు కాదన్నారు. కురుమ కులస్తులు స్వతంత్రంగా ఏ పదవి పొందలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కురుమల వృత్తి, గొర్ల కాపర్లు, యాదవుల వృత్తి వేర్వేరు అని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో గొల్ల కురుమ భవనం ఏర్పాటు చేసినప్పుడే కురుమలందరు వ్యతిరేకించి కురుమ భవనం వేరుగా నిర్మించుకున్నామన్నారు. వివాహ విషయంలోకి వస్తే కూడా ఒకరికొకరు పెండ్లి సంబంధాలు కలుపుకునే సంప్రదాయం కూడా లే దన్నారు. కాబట్టి ప్రభుత్వం ఈ అంశంపై పునరాలోచించి కురుమలకు వేరు, యాదవులకు వేరుగా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

తెలంగాణ ఫిషరీస్ కో ఆపరేటివ్ సొసైటీ ఫెడరేషన్ లిమిటెడ్ చైర్మెన్

- మెట్టు సాయి కుమార్‌కు రేపాక తిరుపతి శుభాకాంక్షలు



నవతెలంగాణ-తొగుట

తెలంగాణ ఫిషరీస్ కో ఆపరేటివ్ సొసైటీ ఫెడరేషన్ లిమిటెడ్ చైర్మెన్‌గా నియమితులైన మెట్టు సాయి కుమార్‌కు రాష్ట్ర ఫిషర్మాన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేపాక తిరుపతి ముదిరాజ్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి సర్కార్ 100 రోజుల్లోనే 5 గ్యారంటీలను అమలు చేసి ప్రజా ప్రభుత్వం అనిపించుకుందని అన్నారు. మరోవైపు రాష్ట్ర పార్టీ అధ్యక్షులుగా రేవంత్ రెడ్డి కష్టపడి పనిచేసిన కార్యకర్తలని గుర్తించి ప్రభుత్వంలో సమూచిత స్థానం కలిపించడం గొప్ప విషయమని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలపై కాంగ్రెస్ కార్యకర్తగా ఎంతో గర్వంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. కార్యకర్తలను గుర్తించే ఏకైక పార్టీ కాంగ్రెస్ అని, అన్ని వరాల ప్రజలకు కాంగ్రెస్ పార్టీతోనే న్యాయం జరుగుతుందని ధీమా వ్యక్తం చేసారు.

నేటి నుంచి పదవ తరగతి పరీక్షలు ప్రారంభం

- మాస్ కాపీ పాల్పడితే చర్యలు తప్పవు
- మండల విద్యాధికారి బండి నరసవ్వ



నవతెలంగాణ-దౌల్తాబాద్

పదవ తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తామని దౌల్తాబాద్ మండల విద్యాధికారి బండి నరసవ్వ సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, లింగరాజు పల్లిలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పరీక్షల నిర్వహణకు కావలసిన సిబ్బందిని చీఫ్ సూపరిండెంటెంట్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్స్‌ని నిర్వహణకు సరిపడా ఇన్విజిలేటర్లను నియమించినట్టు తెలిపారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కావలసిన ఫర్నిచర్, తాగునీటిని ఏర్పాటు చేశామన్నారు. దౌల్తాబాద్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 220 మంది విద్యార్థులు, మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో 212 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్టు తెలిపారు. విద్యార్థులు ఎటువంటి మానసిక ఆందోళన చెందకుండా ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాయాలని సూచించారు . మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

భద్రాచల కల్యాణానికి గోటి తలంబ్రాలు తయారు



నవతెలంగాణ- గజ్వేల్

శ్రీరామకోటి భక్త సమాజం ఆధ్వర్యంలో గజ్వేల్ కృష్ణాలయంలో భక్తులు కోటి తలంబ్రాల దీక్షలో పాల్గొని వడ్లను ఒలిచి తలంబ్రాలుగా తయారుచేసి భద్రాచల సీతారాముల కల్యాణం కోసం సంస్థ అధ్యక్షులు రామకోటి రామరాజుకు అందజేశారు. ఈ సందర్భంగా రామకోటి రామరాజు మాట్లాడుతూ.. భక్తులందరూ రామనామ స్మరణ చేస్తూ గోటితో తలంబ్రాలు భక్తితో ఒలిచి అందించడం వారి రామభక్తికి నిదర్శనం అన్నారు. భక్తులు మాట్లాడుతూ.. తాము ఒలిచిన తలంబ్రాలు భద్రాచల కల్యాణానికి వెళ్లడం ఆనందంగా ఉందని తెలిపారు. రామకోటి రామరాజు వల్ల ఈ అవకాశం రావడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో కృష్ణాలయం అధ్యక్షులు ఎలగందుల రాంచంద్రం, దూళకుంట మైత్రాములు, బండి శ్రీను, జైహింద్, దశరథం, దూళకుంట నాగమణి, ఎలగందుల బాలమని పాల్గొన్నారు.

ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు హర్షనీయం



నవతెలంగాణ -నంగునూరు

రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేయడం పట్ల కాంగ్రెస్ బీసీ సెల్ మండల అధ్యక్షులు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ హర్షం వ్యక్తంచేశారు. ఆదివారం నంగునూరు మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ముదిరాజ్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, దీనికోసం కృషి చేసినటువంటి మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ముదిరాజ్, మంత్రివర్గ సహచరులకు, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ముదిరాజ్ కులస్తులను బీసీ డీ నుంచి బీసీ ఏ కేటగిరిలోకి మార్చాలని కోరారు. ముదిరాజుల సంక్షేమం కోసం రూ. 1000 కోట్ల నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను తూచా తప్పకుండా అమలు చేస్తుందని చెప్పారు.

నేటి నుంచి పదో తరగతి పరీక్షలు

నవతెలంగాణ -నంగునూరు

నేటి నుంచి జరిగే పదో తరగతి పరీక్షలకు నంగునూరు మండలంలోని విద్యార్థుల కోసం మూడు పరీక్షా కేంద్రాలు ఏర్పాట్లు చేశారు. అక్కెనపల్లి తెలంగాణ మోడల్ స్కూల్ పరీక్షా కేంద్రంలో 102 మంది, నంగునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో 103 మంది, రాజగోపాల్ పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో 158మంది విద్యార్థులు.. మొత్తం ఈ విద్యా సంవత్సరంలో 363 మంది పదవ తరగతి విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు.

బాధిత కుటుంబాన్ని ఓదార్చిన చైర్మెన్



నవతెలంగాణ- గజ్వేల్

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన మామిడి బిక్షపతి (58)కు గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మెన్ నేతి చిన్న రాజమౌళి గుప్తా నివాళులర్పించారు. వారి కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. కాగా, మామిడి బిక్షపతి గజ్వేల్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి, హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం మృతి చెందారు. భౌతికకాయాన్ని సందర్శించిన వారిలో.. సిద్దిపేట జిల్లా కబ్బడి అసోసియేషన్ అధ్యక్షులు నేతి చిన్న సంతోష్ గుప్తా , కౌన్సిలర్ విద్య రాణి శ్రీధర్. మామిడి శంకర్, విద్యాకర్, మామిడి రాములు, మామిడి కృష్ణ, దామోదర్ రెడ్డి, అయిల వేణు, ప్రవీణ్, మహిపాల్ రెడ్డి'మున్నూరు కాపు సంఘం నాయకులు నర్సింలు, బండ్ల స్వామి తదితరులు ఉన్నారు.